క్లుప్తంగా

28న అగ్రిగోల్డ్ మహా విజ్ఞాపన దీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 28న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో ఉన్నటువంటి సుమారు పదిన్నర లక్షల కుటుంబాలకు ఇంకా రూ. 3080 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించుటలో సమర్థ అధికారులతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బరాజు నూకల వెంకటేశ్వర్లు భాగ్యమ్మ ,రాజశేఖర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, కళాశాల స్థాయిలో జాగ్రత్తగా ఉండాలి

– ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి



కడప ఎడ్యుకేషన్: పాఠశాల, కళాశాలల స్థాయి నుంచే తల్లితండ్రుల తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం బాలగంగిరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం కడపలో మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లలను తల్లితండ్రులు ఎప్పుడు ఓ కంటి కని పెట్టే ఉండాలన్నారు. పిల్లల బాధ్యతలను ఉపాధ్యాయులపైన వదిలేయ కూడదన్నారు. నేడు చాలామంది విద్యార్థులు గంజాయి, సిగరెట్ వంటి చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. ముక్కపచ్చలారని చిన్నారుల పట్ల అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని అందులో పెద్దవారు పిల్లలకు నిజాయితీ, నిబద్ధత, సంప్రదాయల వంటి వాటి గురించి తెలియ చేసేవారన్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయన్నారు.

రేపు వినికిడి లోపం వారికి ఉచిత మెడికల్ క్యాంప్

కడప రూరల్: వినికిడి లోపం సమస్యల గల వారికి మంగళవారం ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 0–19 సంవత్సరాలు కలిగిన వారికి దీనదయాల్ శ్రవణా ఫౌండేషన్ అండ్ ఎన్‌హెచ్‌ఎం, ఎన్‌పీపీసీడీ, ఆర్‌బీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను కడపలోని డీఈఐసీ రిమ్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చే వారు తమ వెంట ఆధార్, రేషన్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఈఎన్‌టీ వైద్యుల ప్రిస్కిప్షన్ , ప్యూర్‌టోన్ ఆడియో మీటర్ రిపోర్ట్‌ను తీసుకు రావాలని పేర్కొన్నారు.

'మండలి'ని ఆహ్వానించిన రచయితల సంఘం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు ఆదివారం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌ను తమ సభలకు ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్న రచయితల సంఘం సభలకు తప్పక రావాలని సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆయనను కోరారు. గత ఏడాది నిర్వహించిన సభల వివరాలు క్లుప్తంగా తెలుపుతూ రానున్న సభల్లో నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. ఆదివారం నగరంలోని ఓ సాహితీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మండలిని వారు కలిసి ఈ మేరకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు అలపర్తి పిచ్చయయ చౌదరి, జింకా సుబ్రమణ్యం, విద్వాన్ గానుగ పెంట హనుమంతరావు, డాక్టర్ వెల్లాల వెంటేశ్వరాచారి, డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై దాడి హేయమైన చర్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షులు శివ కొండారెడ్డిపై దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ నేతలు తెలిపారు. ఆదివారం వారు నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లో ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. పోలీసు అధికారులు ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివ కొండారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకృష్ణ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, టీడీపీ నేత కట్టా రమేష్ పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై విద్యార్థులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కడప నగరానికి చెందిన వర్షిణి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

స్కౌట్ శిక్షణ.. భవితకు నిచ్చెన

- ఉత్సాహంగా సాగుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం
- ఐదురోజుల పాటు నిర్వహణ
- వివిధ పాఠశాలల నుంచి స్కౌట్స్ హాజరు

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత, జట్టుపని అలవర్చేలా విద్యార్థిదశ నుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సేవాసంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'.. సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో స్కౌట్స్ (బాలురకు) త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోంది.



త్రితీయసోపాన్ టెస్టింగ్ క్యాంపులో శిక్షణ పొందుతున్న స్కౌట్స్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 18 నుంచి త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ప్రారంభమైంది. జిల్లాలోని పలు పాఠశాలలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌కు సంబంధించిన స్కౌట్స్ క్యాంపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెసిడెన్షియల్ విధానంలో ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ శిబిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రవేశ్, ప్రథమ్ సోపాన్, ద్వితీయ సోపాన్, త్రితీయ సోపాన్‌లకు సంబంధించిన కోర్సులను శిక్షణలో నేర్పుతారు. వీటితో పాటు స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా విద్యార్థుల్లో ఉత్సాహంగా లభిస్తుంది. సమాజంపై అవగాహన ఏర్పడుతుంది. సామాజిక సేవాతత్పరత అలవడటమే కాకుండా దేశభక్తి పెంపొందుతుంది. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగమించే మానసిక స్థైర్యం అలవడుతుంది. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవడతాయి. ఆటపాటలతో కూడిన శిక్షణ అంశాల మూలంగా పిల్లల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంతటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కొనే స్థైర్యం వారి సొంతమవుతుంది. 8 అంశాల స్కౌట్స్ నియమాలు విద్యార్థులను పరిపూర్ణవంతులుగా మలించేందుకు ఉపయోగపడుతుంది.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నేర్పే అంశాలు..

- నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- జట్టుకృషిని మరియు సహకారాన్ని ప్రోత్సహించడం.
- ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం.
- శారీరక దృఢత్వం మరియు బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం.
- జీవననైపుణ్యాలను నేర్చుకోవడం.
- సమాజ సేవాభావాన్ని పెంపొందించడం.
- సాంస్కృతిక అవగాహనను అభివృద్ధి చేయడం.
- వ్యక్తిగత వృద్ధికి అవకాశాలను అందించడం.

క్యాంపులో పాల్గొనడం సంతోషంగా ఉంది



త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉంది. క్యాంపులో క్రమబద్ధమైన జీవన విధానంతో పాటు ఉత్తమ శిక్షణ ఇస్తున్నారు. కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం లభించింది.

– ఎం. పార్థీవ్, 10వ తరగతి, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కడప

స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్నా..



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం గర్వంగా భావిస్తాను. ఆగస్టు 15న నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌లో స్కౌట్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం త్రితీయ సోపాన్ క్యాంపునకు హాజరయ్యాను. క్యాంపు ఎంతో చక్కగా సాగుతోంది.

– ఎన్. వంశీ, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్, మైదుకూరు

చాలా విషయాలు తెలుసుకున్నాను..



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన చాలా విషయాలను తెలుసుకున్నాను. ప్రవేశ్, ప్రథమ్, ద్వితీయ, త్రితీయ సోపాన్‌లకు సంబంధించిన కోర్సుల వివరాలు శిక్షణలో నేర్పుతున్నారు.

– జి. ప్రేమ్‌కుమార్, 8వ తరగతి, జెడ్పీ హైస్కూల్, బద్వేలు

ఐదురోజుల పాటు శిక్షణ..



ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు నిర్వహిస్తున్నాం. లీడర్ ఆఫ్ ది కోర్సు రమణయ్య విచ్చేసి విచ్చేసి క్యాంప్‌ను పర్యవేక్షిస్తున్నారు. **– డి. ప్రమీల, కార్యదర్శి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, కడప**

డయల్ 100, 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

– జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు డయల్ 100, 112 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలోపై నెంబర్లు పనిచేయడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని, రెండు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సీఈకి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు కడప జోన్ చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించింది. యూనియన్ నాయకులు మాట్లాడు తూ కడప జోన్‌లోని చిత్తూరు, అనంతపురం జిల్లాకు సంబంధించి కారుణ్య నియామకాల భర్తీకి అనుమతి ఇవ్వాలని, సంవత్సరాల తరబడి డిప్యూటేషన్‌లో దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని నూతన సబ్ స్టేషన్లకు, ఖాళీ ఉన్న సబ్‌స్టేషన్లకు బదిలీ చేయాలన్నారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్, విద్యార్హత ఆధారంగాపై పోస్టులకు బదిలీ చేయాలన్నారు. చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన వారిలో ఎం. సుధాకర్, రవి నాయక్, సుబ్బరాయుడు, ప్రతాప్, మదన్ కుమార్, షామీర్ బాషా, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్



స్వర్ణోత్సవ సభల్లో మాట్లాడుతున్న కె.ఎస్.ఎస్.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల సందర్భంగా కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన మహాసభల్లో కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. పని సర్దుబాటు లోప భూయిష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, రూ.3.50 కోట్లు మాత్రమే తీర్చారని చెప్పారు. పీఆర్సీ కమిషన్ వేయాలని, అప్పటి లోపు ఐఆర్ సాధించుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ పీఆర్సీ ఉద్యమంలో యూటీఎఫ్ ముందు భాగాన ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, నవకోటేశ్వరరావు మాట్లాడుతూ సంఘం విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతుందన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ సేవలు అభినందనీయమని చెప్పారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడారు. సమావేశంలో సికె దిన్నె ఎండీఓ -2 రమావేది, కడప ఎండీఓ గంగిరెడ్డి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఎస్ఐ జిల్లా కార్యదర్శులు రవి, శివకుమార్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు షామీర్ బాషా, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవి కుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ కడప డివిజన్ యూనిట్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. కడప డివిజన్ ప్రెసిడెంట్‌గా శ్రీపతి ఓబులేశు, వైస్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌రాజు, సెక్రటరీ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భరణికుమార్, జాయింట్ సెక్రటరీ భాను, ట్రెజరర్‌గా విశ్వనాథ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?



బస్సులో ప్రయాణిస్తున్న విజయజ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ప్రశ్నించారు. ఆదివారం కడప యర్రగుంట్ల బస్సులో తోటి మహిళా ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలు అయినా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నారన్నారు. తెలంగాణలో వారంలో అమలు చేశారని, కర్ణాటకలో కూడా అమలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో 4 పథకాలు మహిళలవే. ఇందులో ఉచిత ప్రయాణం ఒక్కటే తక్కువ ఖర్చు. ఇలాంటి తక్కువ ఖర్చు పథకం కూడా మీకు అమలు చేయడానికి ధైర్యం రావడం లేదా అన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు భద్రత ఉంటుందన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



విజయవాడకు తరలుతున్న ఆశా కార్యకర్తలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చేపట్టనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి సుభాషిణి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని చలో విజయవాడ బయలుదేరుతూ కడప రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ నాయకుల అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికై అనేక ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రులకు అధికారులకు అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఆశాల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానంలో ఆశాలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలన్నారు. ఈనెల 23వ తేదీన జరుగుతున్న మంత్రివర్గ సమావేశంలో ఆశాల సమస్యలపైన చర్చించి సమస్యలు పరిష్కరించకపోతే సమరశీల ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ ఉపాధ్యక్షులు పెద్ద అనసూయ, జిల్లా కోశాధికారి అమ్ములు ,దేవి, జోరతి, ఉమామహేశ్వరి, నారాయణమ్మ, రాజేశ్వరి, ముకుంద, చిన్న అనసూయ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్







మాట్లాడుతున్న నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు, మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, కొవ్వొత్తులతో ఆర్ఎస్‌యూ నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేలులో ప్రేమోన్మాది విఘ్నేష్ ఘాతుకానికి బలైన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని దస్తగిరమ్మ కుటుంబానికి న్యాయం చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓ. రసూల్ సాహెబ్ పేర్కొన్నారు. శనివారం ప్రేమోన్మాది ఘాతుకానికి బలై రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతి చెందిన దస్తగిరమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దస్తగిరమ్మను అత్యాచారం చేసి హత్య చేయడం బాధకరం అన్నారు. మృతిరాలి కుటుంబానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించి, ఆ కుటుంబలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా అధికారులు, ఎమ్మెల్యేలు హామీ ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనపై జిల్లాలోని టీడీపీ నాయకులు ఈ విషయంపై స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో చిన్నారులు, మహిళలపై ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రాజా, యూత్ అధికార ప్రతినిధి కమాల్ బాషా, రాష్ట్ర సంఘ సలహాదారులు అయిల్ మిల్ ఓబులేసు, పరుపుల అంగడి ఖాదర్ బాషా, జిల్లా దూదేకుల సంఘం నాయకులు కులాయప్ప, హుస్సేన్, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేలు నగరంలో ఇంటర్ చదువుతున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని దస్తగిరమ్మ మరణానికి కారణమైన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమెన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం విద్యార్థినిల పట్ల ఇలాంటి దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థినులకు భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు బి తేజ అఖిరానంద్, మస్తాన్, అరుణ్ రాజేష్, ధనుష్, సాగర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: బద్వేల్ పట్టణ శివార్లలో ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం జరిపి ఆమె మృతికి కారణమైన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆదివారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుల బిసి వసతి గృహంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ కడప నగర అధ్యక్షుడు కొండేటి కార్యదర్శి వెంకటేష్ ధనుంజయ్. సాయికుమార్ . చంద్రశేఖర్.నాయకులు పాల్గొన్నారు.

కఠిన చర్యలకు పౌరహక్కుల సంఘం డిమాండ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : బద్వేల్ పట్టణం రామాంజనేయ పురానికి చెందిన ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పౌరహక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. అంతకుముందు వారు రిమ్స్ మార్చురీ వద్ద మృతురాలి తల్లిదండ్రులను, బంధువులను, బద్వేల్ పోలీస్ అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. గత సంవత్సరం కాలంగా రాష్ట్రంలో బాలికలు మహిళలపై లైంగిక దాడులు హత్యలు, అత్యాచారాలు నిత్య కృతకృత్యమయ్యాయని తెలిపారు. బద్వేలు సంఘటన మొదటిది కాదని, కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో 9 ఏళ్ల బాలిక వాసంతి మొదలుకొని పుంగనూరు ఆసియా, కర్నూలు జిల్లాలో ఇంటర్ విద్యార్థిని, సత్యసాయి జిల్లాలో అత్తా,కోడల్ల పై లైంగిక దాడులు, ఇలా ఎన్నో దారుణ సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఇలాంటి అమానుష సంఘటనలు పునరావృత్తం కాకుండా చట్టపరమైన కేసు నమోదు చేసి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే మానవత్వం



చెక్కును అందజేస్తున్న ఎంసీ వెంకట సుబ్బయ్య

కడప కల్చరల్ : కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వం అని డాక్టర్ ఎంసీ వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విలువలు గల వ్యక్తులను ఒకచోట చేర్చి సమాజానికి సేవ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వంగా భావిస్తున్నామని తెలిపారు. మరో అతిథి గోపాలరావు, సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు రాటాల గోపి, డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి, ఇతర ప్రతినిధులు పి.సుబ్రమణ్యం, కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంసీ వెంకట సుబ్బయ్య సంస్థ కార్యకలాపాలతో తృప్తి చెందామని, తనవంతుగా రూ. లక్ష విరాళం ప్రకటిస్తున్నానని చెక్కు అందజేశారు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న విద్యార్థి గునిగారి నిహిత్‌కు రూ. 10 వేలు చెక్కును అందజేశారు. కడప నగరంలో ఇప్పటికి మూడు వేల మంది సభ్యులను చేర్చి సంస్థ ముందువరుసలో నిలుపామన్నారు. కార్యక్రమంలో బైరెడ్డి విష్ణు శివమోహన్‌రెడ్డి, జీవీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రణాళికతోనే విజయం సాధ్యం

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికతోనే చక్కటి ఫలితాలను సాధిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప అక్కాయపల్లెలోని సాయిబాబా విద్యా సంస్థలో పదవ తరగతి చదివే విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైన కూడా ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే దేనినైనా సాధించగలరన్నారు. మంచి ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస ప్రేరకులు పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయాన్ని సులభంగా సాధిస్తారన్నారు. విద్యార్థులు మానసిక ప్రశాంతతతో ఉంటూ ఏకాగ్రతతో చదివి పరీక్షలను రాస్తే విజయం వరిస్తుందన్నారు. కడప 46వ డివిజన్ కార్పొరేటర్ యంవీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన చాలా ముఖ్యం అన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ యంవి సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరిని ఒక ప్రణాళికా బద్ధంగా చదివిస్తున్నామని, తప్పని సరిగా మంచి ఫలితాలను తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

టీచర్ల శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయండి

– ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారన్నారు. వీటితోపాటు బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులైన తల్లి దండ్రుల బాధ్యతలను చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిఅవుతారన్నారు. పాఠశాలల పనివేళల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. పాఠశాల సముదాయాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు పాఠశాలల్లో అందుబాటులో ఉండరనే చెడు అభిప్రాయం విద్యార్థుల తల్లితండ్రలలో ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చే అన్ని రకాల శిక్షణలను వేసవి సెలవుల్లో నిర్వహించాలన్నారు. ముందుగా జిల్లాస్థాయిలో రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణను ఇచ్చి వారి ద్వారా మండలస్థాయిలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లాకార్యదర్శులు రమేష్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 29, 30న రెండు రోజులు కడప వేదికగా నిర్వహించనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడియం చిన్ని, వీరనాల.శివకుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశాలకు అఖిల భారత అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఎంపీ ఏ. ఏ.రహీమ్ గారు ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్నారన్నారు. అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి రాష్ట్ర నాయకత్వం సమావేశాలకు హాజరుతున్నట్లు తెలిపారు. కమిటీ సమావేశాల్లో కడప ఉక్కు రాష్ట్ర విభజన హామీలు అమలే అజెండాగా తీసుకొని చర్చించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా విభజన హామీలలో ప్రధాన డిమాండ్ అయిన కడప ఉక్కు ను కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ కాలం గడుపుతూ వస్తున్నదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా కడప ఉక్కు కు పునాది రాయి పడలేదన్నారు. ముఖ్యమంత్రిలు, వారు వేసిన పునాదిరాళ్లు మారుతున్నాయే తప్ప కడప ఉక్కు శంకుస్థాపన మాత్రం జరగలేదన్నారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పినా కేంద్రం అది అమలు సాధ్యం కాదని దటవేసింది అన్నారు. కేంద్రాన్ని నిలదీసి రాష్ట్ర హక్కులు రాబట్టడంలో వైఎస్ఆర్సీపీ, టీడీపీ, జనసేన విఫలం చెందాయన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు గుర్రం డేవిడ్ రాజ్ జిల్లా సహాయ కార్యదర్శులు తులసిశ్వర్ యాదవ్ అంజి కడప నగర కన్వీనర్ విజయ్ జిల్లా కమిటీ సభ్యులు గురయ్యా విశ్వనాథ్ పాల్గొన్నారు.